హైకోర్టు తాత్కాలిక సీజేగా జస్టిస్ సుజయ్‌పాల్

- బాంబే హైకోర్టు సీజేగా జస్టిస్ ఆలోక్‌అరాధే బదిలీ
- రాష్ట్రపతి ఉత్తర్వులు

హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్‌అరాధే బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాన న్యాయమూర్తి బదిలీ కావడంతో తాత్కాలికంగా ఆ బాధ్యతలను రెండో స్థానంలో ఉన్న సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. జస్టిస్ సుజయ్‌పాల్ 1964 జూన్ 21న జన్మించారు. పండిట్ ఎల్‌ఎస్ ఝా మోడల్‌స్కూల్‌లో ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు చదివారు. మధ్య ప్రదేశ్ జబల్‌పూర్‌లోని రాణిదుర్గావతి వర్సిటీలో ఎల్ఎల్‌బీ, పీజీ పూర్తి చేశారు. 1990లో మధ్యప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. రాజ్యాంగ, పారిశ్రామిక, సివిల్, సర్వీసు కేసుల్లో రాణించడంతో గుర్తింపు పొందారు. 2011లో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2024 మార్చి 26న తెలంగాణ హైకోర్టుకు బదిలీపై వచ్చారు. ఇప్పుడు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా వ్యవహరించనున్నారు.

ఏప్రిల్ 29 నుంచి ఎప్‌సెట్

- షెడ్యూల్ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి

హైదరాబాద్, జనవరి 15(నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాలకు నిర్వహించే ఎప్‌సెట్ పరీక్ష తేదీలు ఖరారయ్యాయి. ఏప్రిల్ 29 నుంచి మే 5 వరకు ఎప్‌సెట్‌ను(ఈఏపీ) ఉన్నత విద్యామండలి నిర్వహించనున్నది. వీటితోపాటు మిగతా ఉమ్మడి ప్రవేశ పరీక్ష(సెట్స్)ల షెడ్యూల్‌ను సైతం వెల్లడించింది. తెలంగాణ ఉన్నత విద్యామండలి బుధవారం ప్రకటన విడుదల చేసింది. వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ పద్ధతిలో నిర్వహిస్తారు. ఏప్రిల్ 29 నుంచి జూన్ 19 వరకు మొత్తం ఎంట్రెన్స్ టెస్టులను నిర్వహించనున్నారు. ఎప్‌సెట్ పరీక్షలను జేఎన్టీయూహెచ్ నిర్వహించనుంది. డిప్లొమా విద్యార్థులు లాటరల్ ఎంట్రీ ద్వారా ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో సెకండియర్‌లో చేరేందుకు నిర్వహించే ఈసెట్‌ను మే 12న నిర్వహించనుంది.

సెట్స్ షెడ్యూల్ ఇలా....

సెట్ పేరు	కోర్సు	వర్సిటీ	పరీక్ష తేదీలు
ఎప్‌సెట్	బీఫార్మసీ, అగ్రికల్చర్, బీఈ, బీటెక్	జేఎన్టీయూహెచ్	ఏప్రిల్ 29, 30(అగ్రికల్చర్), మే 2 నుంచి 5 (ఇంజినీరింగ్)
ఈసెట్	బీఈ, బీటెక్, బీఫార్మసీ (సెకండియర్)	ఉస్మానియా	మే 12 (లాటరల్ ఎంట్రీ)
ఎడ్‌సెట్	బీఈడీ	కాకతీయ	జూన్ 1
లాసెట్	3, 5 సం. లా కోర్సు	ఉస్మానియా	జూన్ 6
పీజీ లాసెట్	ఎల్ఎల్ఎం	ఉస్మానియా	జూన్ 6
ఐసెట్	ఎంబీఏ, ఎంసీఏ	ఎంజీయూ	జూన్ 8, 9
పీజీఈసెట్	ఎంఈ/ఎంటెక్, ఎంఫార్మసీ/ఎంఆర్క్	జేఎన్టీయూ	జూన్ 16 నుంచి 19
పీఈసెట్	యూజీ డీపీఈడీ, బీపీఈడీ	పాలమూరు	జూన్ 11 నుంచి 14

హైకోర్టుకు నలుగురు జడ్జీలు!

- జిల్లా జడ్జీల కోటాలో పదోన్నతి
- సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు
- 30కి చేరనున్న న్యాయమూర్తుల సంఖ్య

రేణుక యారా, నందికొండ నర్సింగ్‌రావు, ఈ తిరుమలాదేవి, మధుసూదన్‌రావు

హైదరాబాద్,జనవరి 15,(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర హైకోర్టుకు నలుగురు న్యాయమూర్తుల పేర్లను సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి ఈ నెల 11న సిఫారసు చేసింది. జిల్లా జడ్జీల కోటాలో ఈ నలుగురి పేర్లను ప్రతిపాదించింది. సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుక యారా, సిటీ సివిల్ స్మాల్‌కాజెస్ కోర్టు చీఫ్ జడ్జి నందికొండ నర్సింగ్‌రావు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఈ తిరుమలాదేవి, హైకోర్టు పరిపాలనా విభాగం రిజిస్ట్రార్ బీఆర్ మధుసూదన్‌రావును తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం హైకోర్టులో చీఫ్ జస్టిస్ బదిలీ తర్వాత తాత్కాలిక సీజేతో కలిపి 26 మంది న్యాయమూర్తులు ఉన్నారు. కొత్త పేర్లను కేంద్ర న్యాయశాఖ ఆమోదం తెలిపి, రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే ఆ సంఖ్య 30కి చేరుతుంది. ఈ లోగానే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నియామకం కూడా జరిగితే ఆ సంఖ్య 31కి పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు హరిహరనాథ శర్మ, యడవల్లి లక్ష్మణరావు పేర్లను కూడా సుప్రీంకోర్టు కొలీజియం ప్రతిపాదించింది.

రేణుక యారా

హైదరాబాద్‌లో ఐలయ్య, నాగమణి దంపతులకు 1973 జూన్ 14న రేణుక యారా జన్మించారు. హైదరాబాద్‌లోనే పాఠశాల విద్యను పూర్తిచేశారు. బషీర్‌బాగ్‌లోని పీజీ కాలేజీ అఫ్ లాలో 1998లో ఎల్ఎల్‌బీ పూర్తిచేశారు. ఆ తర్వాత ఫిలడెల్ఫియా విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్ఎం చేశారు. 1998లో రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో న్యాయవాది అయి, సిటీ సివిల్‌కోర్టులో ప్రాక్టీస్ మొదలుపెట్టారు. 2012 డిసెంబర్‌లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లో పనిచేశారు. వ్యాట్ ట్రిబ్యునల్ జ్యుడీషియల్ సభ్యుడిగా పనిచేశారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శిగా కూడా చేశారు. ప్రస్తుతం సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

నందికొండ నర్సింగ్‌రావు

హైదరాబాద్ చెందిన నందికొండ పెంటయ్య, మణెమ్మ దంపతులకు నందికొండ నర్సింగ్‌రావు 1969 మే 3న జన్మించారు. హైదరాబాద్‌లోనే పాఠశాల, కళాశాల విద్యాభ్యాసం పూర్తిచేశారు. సీఎంఆర్ కాలేజీలో 1995లో లా చేశారు. అదే ఏడాది న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2012లో నేరుగా జిల్లా జడ్జిగా ఎంపికయ్యాక విశాఖపట్నం అదనపు జిల్లా జడ్జిగా బాధ్యతలు చేపట్టారు. జ్యుడీషియల్ అకాడమీలో గుంటూరు, వరంగల్, ఎల్బీనగర్, సైబరాబాద్ ఎంఎస్‌ఐగా, న్యాయశాఖ కార్యదర్శిగా పనిచేశారు. హైకోర్టు జ్యుడీషియల్ ఇన్ ఫ్రా రిజిస్ట్రార్‌గా చేశారు. ఇప్పుడు సిటీ స్మాల్‌కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఈ తిరుమలాదేవి

సంగారెడ్డికి చెందిన ఈ తిరుమలాదేవి 1964 జూన్ 2న తిరుమలాదేవి జన్మించారు. హైదరాబాద్‌లోనే చదివారు. లా చేశాక హైకోర్టుతోపాటు జిల్లా కోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. 2012లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. నిజామాబాద్, ఖమ్మం, వరంగల్‌లో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జిగా చేశారు. హైకోర్టు రిజిస్ట్రార్‌గా, తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా చేశారు. ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, విజిలెన్ రిజిస్ట్రార్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

బీఆర్ మధుసూదన్‌రావు

ఉమ్మడి వరంగల్ జిల్లా ఖాజీపేటలో బీ ఎల్లయ్య, అనసూయ దంపతులకు 1969 మే 25న మధుసూదన్‌రావు జన్మించారు. రైల్వే హైస్కూల్‌లో పాఠశాల విద్య, కాకతీయ యూనివర్శిటీలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తిచేశారు.1999లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2012 డిసెంబర్‌లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యాక నెల్లూరు, చిత్తూరు, మేడ్చల్ మల్కాజిగిరి కోర్టుల్లో పనిచేశారు. సీబీఐ కోర్టు ప్రధాన జడ్జిగా, వ్యాట్ జ్యుడీషియల్ సభ్యుడిగా, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రార్‌గా (పరిపాలన) పనిచేస్తున్నారు.

26తో ముగియనున్న మున్సిపల్ పాలన

- పాలకమండళ్ల గడువు 26 వరకే
- ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించేది కష్టమేనంటున్న విశ్లేషకులు
- వెంటనే అమల్లోకి స్పెషల్ ఆఫీసర్ల పాలన

హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 128 మున్సిపాలిటీ పాలకమండళ్ల గడువు ఈ నెల 26తో ముగుస్తుంది. ఆ మరుసటిరోజు నుంచే స్పెషల్ అధికారుల పాలన అమల్లోకి రానున్నది. ప్రస్తుత పాలక మండళ్ల గడువు ముగిసేలోగానే ఎన్నికలు పూర్తిచేయాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ కోణంలో ఆలోచించడమే లేదు. దీంతో పురపాలన అస్తవ్యస్తమవుతుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. నిరుడే గడువు ముగిసిన పంచాయతీలలోనే ఇంతవరకు ఎన్నికలు నిర్వహించలేదు. పంచాయతీ ఎన్నికలతోపాటు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే పరిస్థితులు తక్కువగానే ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతకు ముందే బీసీలకు 42% రిజర్వేషన్ లెక్క తేలాలి. ప్రభుత్వం ఇప్పటికే డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఆ కమిటీ నివేదికను అనుసరించి మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణ ఆధారపడి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరో 10 రోజుల్లో మున్సిపల్ పాలక మండళ్ల గడువు ముగియనున్న నేపథ్యంలో మూలకు పడిన పనులకు మోక్షం కల్పించారు. ఆ పనులను శరవేగంగా పూర్తిచేస్తున్నారు. ఆగమేఘాలపైన రాత్రికి రాత్రే పనులు చేపడుతున్నారు. మున్సిపల్ ఎన్నికల ముందే పనులన్నింటినీ ఒకేసారి పూర్తిచేసే హడావుడి నెలకొన్నది.

బీఆర్ఎస్ హయాంలోనే 25% పూర్తి

ఇప్పుడు కొనసాగుతున్న ఆయా పనులన్నీ బీఆర్ఎస్ హయాంలో మంజూరైనవే కావడం గమనార్హం. గత అసెంబ్లీ ఎన్నికల ముందే మొదలు పెట్టారు. 25% పనులు కూడా పూర్తయినట్టు తెలిసింది. కానీ గత ఎన్నికల వల్ల ఆయా పనులు పెండింగ్‌లో పడ్డాయి. బీఆర్ఎస్ హయాంలో మొదలుపెట్టిన పనులకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మోక్షం లభించలేదు. ఆ పనులు పెండింగ్‌లో పడి ఏడాది దాటింది. ఉన్నట్టుండి పెండింగ్ పనులపైన కాంగ్రెస్ పాలకులకు ప్రేమ పుట్టడం, హడావుడిగా పనులు మొదలు పెట్టడం, రాత్రికి రాత్రే రోడ్లు వేస్తుండటం, ఇందుకోసం యంత్రాంగం మొత్తం అక్కడే మకాం వేయడం.. వంటి పరిణామాలు అందరిలోనూ అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. 10 రోజుల్లో పాలకమండళ్ల గడువు ముగుస్తుంది. వెంటనే ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి రాగా, అప్పుడు బిల్లులు మంజూరు కావడం కొంతవరకు కష్టమే. పెండింగ్ పనులు పూర్తి చేస్తున్నట్టు మమ అనిపించి, ప్రస్తుతం ఉన్న పాలక మండలిలోనే బిల్లులకు ఆమోదముద్ర వేయించుకోవాలన్న భావనలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని తెలుస్తున్నది.

సాగునీటి కోసం రైతుల నిరసన

వడ్డేపల్లి, జనవరి 15 : ఆర్డీఎస్ కెనాల్‌కు సాగునీటిని విడుదల చేసి తమ పంటలు కాపాడాలని డిమాండ్ చేస్తూ జోగుళాంబ గద్వాల జిల్లా శాంతినగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు బుధవారం రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు వడ్డేపల్లి సూరి మాట్లాడుతూ.. వడ్డేపల్లి, రాజోళి మండలాల్లో వందలాది ఎకరాల్లో వేసిన మక్కజొన్న, మిరప పంటలు సాగునీరు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి వెంటనే సాగునీటిని విడుదల చేయాలని కోరారు. రైతుల ఆందోళనతో రాకపోకలు స్తంభించిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని అధికారులతో మాట్లాడిస్తామని హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు.

కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

- మూడ్రోజుల్లో ఏపీలో వానలు
- తెలంగాణలో చలిగాలుల తీవ్రత
- తిర్యాణీలో 12 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో రానున్న మూడ్రోజుల్లో ఏపీలో వర్షాలు కురువనున్నట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉన్నది. తెలంగాణలో వర్షాలు లేనప్పటికీ గంటకు పదిహేను మీటర్ల వేగంతో చలిగాలులు వీయనున్నట్టు తెలిపింది. బుధవారం రాత్రి కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణీలో కనిష్ఠంగా 12 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో 13.3, రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో 13.7, నిర్మల్ జిల్లా పెంబీలో 14.1, సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 14.4, కామారెడ్డి జిల్లా జుక్కల్‌లో 14.5, మహబూబ్‌నగర్‌లో 14.9, నల్లగొండ జిల్లా చింతపల్లిలో 15 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మిగతా జిల్లాల్లో 15.1 డిగ్రీల నుంచి 18.2 డిగ్రీల వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది.

30వసారి ఢిల్లీ వెళ్లిన రేవంత్

హైదరాబాద్, జనవరి 15(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఇదేరోజు అక్కడి ఏఐసీసీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. సీఎంతోపాటు కొందరు మంత్రులు, రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేతలు కూడా ఢిల్లీకి వెళ్లారు. ఈ పర్యటనతో కలిపి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ఇప్పటివరకు 13 నెలల కాలంలో 30సార్లు ఢిల్లీకి వెళ్లడం గమనార్హం.

సౌదీలో నర్సు ఉద్యోగాలకు దరఖాస్తులు

హైదరాబాద్, జనవరి 15(నమస్తే తెలంగాణ): సౌదీ అరేబియా, యూఏఈలో నర్సు ఉద్యోగాల భర్తీకి తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. కనీసం రెండేండ్ల క్లినికల్ అనుభవం ఉన్న రిజిస్టర్డ్ నర్సులు ఈ ఉద్యోగాలకు అర్హులు. రూ.1.15 లక్షల నుంచి రూ.2.3 లక్షల మధ్య నెలసరి వేతనం ఉంటుంది. వసతి, పన్నురహిత వేతనం, ఆరోగ్య బీమాతోపాటు వార్షిక సెలవులు తదితర ప్రయోజనాలు ఉంటాయి. ఆసక్తి గలవారు టామ్‌కామ్ వెబ్‌సైట్‌ను కానీ, 8919047600 నంబర్‌లో కానీ సంప్రదించవచ్చు.

పెట్టుబడులు వచ్చేనా?

మొదటిపేజీ తరువాయి...

కార్యక్రమాలు చేపట్టాయి తప్ప కొత్తవి రాలేదు. మరోవైపు, ఈసారి పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నుంచి గట్టి పోటీ ఎదురవుతున్నది. కొత్త పారిశ్రామికవాడలను అభివృద్ధిచేసి తన సుదీర్ఘ రాజకీయ అనుభవం, పరిచయాలతో భారీగా పెట్టుబడులు సాధించేందుకు ఏపీ సీఎం చంద్రబాబు పావులు కదుపుతున్నారు. దీంతో ఈ ఏడాది తెలంగాణ రాష్ట్ర బృందం దావోస్ పర్యటనపై పరిశ్రమ వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

20 నుంచి 24 వరకు డబ్ల్యూఈఎఫ్ సదస్సు

ఈ నెల 20 నుంచి 24 వరకు దావోస్‌లో డబ్ల్యూఈఎఫ్ సదస్సు జరగనున్నది. గత ఏడాది వచ్చిన పెట్టుబడుల కన్నా ఎక్కువ పెట్టుబడులు ఈసారి వస్తాయని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చెప్తున్నారు. గత ఏడాది జరిగిన డబ్ల్యూఈఎఫ్-2024 వార్షిక సదస్సు సందర్భంగా రూ.40,232 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు చేసుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో అదానీ గ్రూప్, జేఎస్‌డబ్ల్యూ, వెబ్‌వర్క్స్, టాటా టెక్నాలజీస్, బీఎల్ఆగ్రో, సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ గ్రూప్ హోల్డింగ్స్, గోడిఎనర్జీ, అరజెన్ లైఫ్‌సైన్సెస్, ఇన్నోవెరా ఫార్మాస్యూటికల్స్, క్యూసెంట్రియో, సిస్ట్రా, ఉబర్, ఓ9 సొల్యూషన్స్ తదితర కంపెనీలతో కుదిరిన ఒప్పందాలు ముఖ్యమైనవి. ప్రభుత్వం ప్రకటించిన రూ.40,232 కోట్లలో కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం నిత్యం విమర్శించే అదానీకి సంబంధించినవే రూ.12,400 కోట్లు ఉండటం గమనార్హం.

మూడొంతుల ఒప్పందాలు ఆ మూడు కంపెనీలవే

గత ఏడాది కుదిరిన ఒప్పందాల్లో రూ.29,400 కోట్లు అదానీ, జేఎస్‌డబ్ల్యూ, గోడి ఇండియా కంపెనీలకు సంబంధించినవే కావడం విశేషం. ఈ మూడు కంపెనీలు ఇంకా కార్యకలాపాలు చేపట్టలేదు. రూ.12,400 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు చేసుకున్న అదానీ గ్రూపు.. రూ.5 వేల కోట్లతో అదానీ గ్రీన్‌ఎనర్జీ 1,350 మెగావాట్ల సామర్థ్యంతో రెండు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. చందన్‌వెల్లిలో అదానీ కొనెక్స్ డాటా సెంటర్, 100 మెగావాట్ల సామర్థ్యంతో డాటా సెంటర్ క్యాంపస్, రూ.1,400 కోట్లతో అంబుజా సిమెంట్స్, రూ.1000 కోట్లతో ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పార్క్‌లో కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, క్షిపణి అభివృద్ధి, తయారీ కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు ఒప్పందం చేసుకున్నది. వీటిలో ఏ ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. సూర్యాపేట జిల్లా రామన్నపేటలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటునకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించగా, స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటులో చేయూతనిచ్చేందుకు అదానీ గ్రూపు ముందుకొచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం వారిచ్చిన రూ.100 కోట్ల విరాళాన్ని తిరిగి వెనక్కు ఇవ్వడంతో స్కిల్ యూనివర్సిటీలో అదానీ పాత్ర ఉండదనే చెప్పవచ్చు.

కార్యకలాపాలు ప్రారంభించని జేఎస్‌డబ్ల్యూ

జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ తెలంగాణలో రూ.9,000 కోట్ల పెట్టుబడితో 1,500 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం గల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్‌ను ఏర్పాటుచేయనున్నట్టు ప్రకటించింది. జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ థర్మల్, హైడ్రో, సౌర వనరుల నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. మన రాష్ట్రంలో ఇంతవరకూ దీనికి సంబంధించిన కార్యకలాపాలు ప్రారంభం కాలేదు.

గోడి ఇండియాదీ అదే పరిస్థితి

గోడి ఇండియా తెలంగాణలో రూ.8,000 కోట్ల పెట్టుబడితో ఆర్అండ్‌డీతోపాటు గిగా స్కేల్ బ్యాటరీసెల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ యూనిట్‌లో బ్యాటరీసెల్ తయారు చేయనున్నట్టు ప్రకటించింది. రాబోయే ఐదేండ్లలో తెలంగాణలో లిథియం, సోడియం అయాన్ సంబంధిత సాంకేతిక పరిజ్ఞానాల పరిశోధన, అభివృద్ధి(ఆర్అండ్‌డీ), గిగా స్కేల్ సెల్ తయారీ కేంద్రం నెలకొల్పనున్నట్టు తెలిపింది. ఇందులోనూ ఎటువంటి పురోగతి లేదు.

మిగిలిన కంపెనీల ఒప్పందాల పురోగతి ఇలా..

- తెలంగాణలో డాటా సెంటర్లను నెలకొల్పేందుకు వెబ్‌వెర్క్స్ రూ.5,200 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. డాటా సెంటర్ల నిర్వహణలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన ఐరన్ మౌంటెన్ అనుబంధ సంస్థ వెబ్ వెర్క్స్.. 2022లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం హైదరాబాద్‌లో 10 మెగావాట్ల నెట్‌వర్కింగ్-హెవీ డాటా సెంటర్‌లో రూ.1,200 కోట్లు పెట్టుబడి పెట్టింది. దీనికి అదనంగా రూ.4,000 కోట్లకుపైగా పెట్టుబడులతో రాబోయే కొద్ది సంవత్సరాల్లో గ్రీన్‌ఫీల్డ్ హైపర్ స్కేల్ డాటా సెంటర్‌ను విస్తరించేందుకు ఒప్పందం చేసుకుంది. కాగా, ఇంతవరకు ఎటువంటి పురోగతి లేకపోవడం గమనార్హం.
- రూ.2000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం చేసుకున్న అరజెన్ లైఫ్‌సైన్సెస్ పరిస్థితి కూడా వీటికి భిన్నమేమీ కాదు. విస్తరణ ప్రణాళికను ప్రకటించిన సదరు సంస్థ, మల్లాపూర్‌లో ప్రస్తుతం ఉన్న యూనిట్‌ను విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నది. కొత్త ఔషధాల సృష్టి, అభివృద్ధి, తయారీ సేవల విభాగంలో 20 ఏండ్లకుపైగా అనుభవమున్న సదరు సంస్థ ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ రంగాలకు కాంట్రాక్ట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సేవలను అందించేందుకు ఏర్పాట్లుచేస్తున్నది. ఇందులో ఇంకా చెప్పుకోదగ్గ పురోగతి లేకపోవడం గమనార్హం.
- గోద్రెజ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఇప్పటికే పామాయిల్ రంగంలో ఉన్న తమ పెట్టుబడులను విస్తరించడంతోపాటు రూ.1000 కోట్లతో కెమికల్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసేందుకు ముందుకొచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఖమ్మం జిల్లాలో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుతోపాటు మలేషియాకు చెందిన అతి పెద్ద పామాయిల్ కంపెనీ సిమ్‌డార్బీ జాయింట్ వెంచర్‌తో దేశంలోనే తొలి ఆయిల్‌పామ్ సీడ్‌గార్డెన్ వాణిజ్య యూనిట్ ఏర్పాటుకు ముందుకొచ్చి కార్యకలాపాలు ప్రారంభించింది. ప్రస్తుతం ఆ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కాగా, కెమికల్ ప్లాంటు పనులు మాత్రం ఇంతవరకూ కొలిక్కి రాలేదనే చెప్పవచ్చు.

ఎమ్మెల్యే ఆర్మూర్‌కు రావొద్దు

- ఇచ్చిన హామీలు అమలు చేయలె
- రాకేశ్‌రెడ్డిపై నందిపేట్‌లో పోస్టర్లు

నందిపేట్‌లోని ఓ ప్రధాన కూడలి వద్ద వెలిసిన పోస్టర్

నందిపేట్/మోర్తాడ్, జనవరి 15: ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఆర్మూర్ నియోజకవర్గానికి రావొద్దంటూ నందిపేట్‌లో బుధవారం పోస్టర్లు వెలిశాయి. నిజామాబాద్ జిల్లా నందిపేట్‌లోని వైన్స్, బస్టాండ్‌తోపాటు పలు ప్రధాన కూడళ్ల వద్ద పోస్టర్లు దర్శనమిచ్చాయి. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తూ ఈ పోస్టర్లను ముద్రించారు. రూపాయికి వైద్యం, సొంత ఖర్చుతో ఇండ్ల నిర్మాణం, యువతకు ఉపాధి మార్గాలు తదితర అంశాలపై గోడలకు పోస్టర్లు అతికించారు. ఎమ్మెల్యే హామీలపై ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ కాగా.. ప్రస్తుతం పోస్టర్లు వెలిశాయి. ఎమ్మెల్యే ఫొటోతో కూడిన పోస్టర్లు గోడలపై కనిపించడం మండలంలో చర్చనీయాంశమైంది. పోస్టర్లు అతికించిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హామీలు అమలు చేయాలంటే అరెస్టులా?: జీవన్‌రెడ్డి

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు కోరుతుంటే.. పోలీసులు అక్రమంగా అరెస్టు చేస్తున్నారని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, నియోజక వర్గానికి రావొద్దంటూ నందిపేట్‌లోని పలు ప్రధాన కూడళ్ల వద్ద పోస్టర్లు వెలిశాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు పలువురిని అరెస్టు చేయడాన్ని ఖండించారు. రాష్ట్రంలో అక్రమ అరెస్టులు, అక్రమ కేసుల పర్వం కొనసాగుతున్నదని విమర్శించారు.

బాల్కొండలో బీఆర్ఎస్ నాయకుల నిరసన

నందిపేట్‌కు చెందిన ఇద్దరు బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం రాత్రి బీఆర్ఎస్ నాయకులు బాల్కొండ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. హామీలను నెరవేర్చాలని ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని అడిగితే అధికారాన్ని అడ్డం పెట్టుకొని కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

తెలంగాణకు టైగర్ బీర్లు?

హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో త్వరలోనే సింగపూర్‌కు చెందిన ప్రముఖ బ్రాండ్ అయిన టైగర్ బీర్లు రాబోతున్నట్టు సమాచారం. టైగర్ బ్రాండ్‌తో ఉన్న బీర్లు సింగపూర్‌లో చాలా ఫేమస్. రాష్ట్రంలో ఇటీవల కాలంలో యూబీ గ్రూప్‌నకు చెందిన కింగ్‌ఫిషర్ సహా వివిధ బ్రాండ్ల కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై విసుగెత్తి తాము తెలంగాణకు బీర్ల సరఫరాను నిలిపివేస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కింగ్‌ఫిషర్ వంటి బ్రాండ్ల స్థానంలో కొత్త బ్రాండ్లను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. దీనిపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో అనేక ప్రతిపాదనలు వచ్చినట్టు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ తరహాలో కొత్త బ్రాండ్లను తీసుకొచ్చే అంశంపై చర్చ జరిగినట్టు తెలుస్తున్నది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి సింగపూర్ వెళ్తున్నందున ప్రధానంగా టైగర్ బీర్ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్టు తెలిసింది. టైగర్ బ్రాండ్ బీర్లు తెలంగాణకు వస్తే భారీ ఎత్తున అమ్మకాలు ఉంటాయని, ప్రభుత్వం వారినే ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటుందని మద్యం వ్యాపార వర్గాలు చెప్తున్నాయి. టైగర్ బ్రాండ్ బీర్లు రాష్ట్ర మార్కెట్‌ను ముంచెత్తడం ఖాయమని చెప్తున్నారు. ఆ కంపెనీ భారీ ఎత్తున తాయిలాలను కూడా రిటైలర్లకు ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. టైగర్ బ్రాండ్‌ను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు పెద్ద ఎత్తున లాబీయింగ్ కూడా జరుగుతున్నట్టు సమాచారం.

అచ్చంపేట ప్రభోత్సవంలో ఉద్రిక్తత

- మాజీ ఎమ్మెల్యే గువ్వల దంపతులు ఆలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- ఆలయం వద్ద తోపులాట.. ఉద్రిక్తత
- నాపై దాడిచేసిన సీఐపై చర్యలు తీసుకోవాలి
- గువ్వల బాలరాజు డిమాండ్



మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును అడ్డుకుంటున్న పోలీసులు

అచ్చంపేట టౌన్, జనవరి 15 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో ప్రభోత్సవంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకున్నది. బుధవారం సాయంత్రం భ్రమరాంబ ఆలయం వద్దకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దంపతులు లోనికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. గుడిలోపల ఎమ్మెల్యే వంశీకృష్ణ ఉన్నందున అనుమతించడం లేదని పోలీసులు స్పష్టంచేశారు. పోలీసులు, కాంగ్రెస్ నాయకులు కలిసి గువ్వలను బయటకు తోసివేశారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ వెళ్లిపోయిన తర్వాత గువ్వల బాలరాజు దంపతులు ఆలయంలోకి వెళ్లారు. అనంతరం పోలీసుల వైఖరిని నిరసిస్తూ గువ్వల నిరసన తెలిపారు. ఆలయంలోకి వెళ్లకుండా తనపై దాడిచేసిన అచ్చంపేట సీఐ రవీందర్‌పై చర్యలు తీసుకోవాలని గువ్వల బాలరాజు డిమాండ్ చేశారు.

ట్రస్ట్ టోకెన్‌తో సైబర్ మోసాలకు చెక్

- సరికొత్త డివైజ్‌ను ఆవిష్కరించిన ఐఐటీ బిలాయ్
- ఈ డివైజ్ కనెక్ట్ చేస్తేనే ఆన్‌లైన్ లావాదేవీలు
- బ్యాంకులతో చర్చలు.. త్వరలో అందుబాటులోకి

బిలాయ్, జనవరి 15: భారత్‌తో పాటు ప్రపంచమంతా ప్రస్తుతం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య సైబర్ మోసం. రోజురోజుకు పెరుగుతున్న ఈ సమస్యకు చెక్ పెట్టే దిశగా ఐఐటీ బిలాయ్ పురోగతి సాధించింది. ఆన్‌లైన్ లావాదేవీలు మరింత సురక్షితంగా ఉండేలా ఐఐటీకి చెందిన బృందం ఓ సరికొత్త పరికరాన్ని ఆవిష్కరించింది. ఈ డివైజ్ సాయంతో యూపీఐ, ఈ-కామర్స్, నెట్ బ్యాంకింగ్ మరింత సురక్షితంగా ఉంటుందని ఐఐటీ బృందం వెల్లడించింది. పెన్‌డ్రైవ్ తరహాలో ఉండే ఈ డివైజ్‌ను 'ట్రస్ట్ టోకెన్'గా పిలుస్తున్నారు.

మొదటి దశ పూర్తి

బృందానికి నేతృత్వం వహించిన డాక్టర్ ధీమన్ సాహ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ లావాదేవీ జరపాలంటే ఈ డివైజ్‌ను కంప్యూటర్ లేదా ఫోన్‌కు కనెక్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. అంతేకాదు, ఈ డివైజ్‌కు కూడా ఒక పాస్‌వర్డ్ ఉంటుందని పేర్కొన్నారు. ఆర్బీఐ, ఐసీఐసీఐ బ్యాంకుతో సంప్రదింపులు జరుగుతున్నాయని, ఒప్పందం పూర్తయితే త్వరలో ఈ డివైజ్ అందుబాటులోకి వస్తుందని, తద్వారా సైబర్ మోసాలు తగ్గే ఆస్కారం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.